## క్లుప్తంగా

### 12 నుంచి హనుమద్ జయంతి ఉత్సవాలు

పెదపాడు: స్థానిక బ్లళ్లరేవుతూము సెంటర్‌లోని అభయాంజనేయస్వామి జయంతి ఉత్సవాలు ఈనెల 12 నుంచి 14 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. 12న పంచామృత అభిషేకం, తమలపాకులతో పూజ, హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహిస్తామన్నారు. 13న సింధూరార్చన, శ్రీరామరక్షా స్తోత్రపారాయణ, లలితా సహస్ర నామ పారాయణ, 14న వివిధ రకాల పుష్పాలతో పూజల అనంతరం అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

జంగారెడ్డిగూడెం రూరల్ : లక్కవరం అరుంధతి పేటలో నిర్మించిన రామాలయంలో ఆదివారం సీతాముల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవారి విగ్రహాలు ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో సీతారాములను దర్శించుకున్నారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన్ను ఆలయ మర్యాదలతో సత్కరించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. సర్పంచ్ గెల్లా వెంకటరమణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి విరాళం

లింగపాలెం : లింగపాలెం మండలం కొణిజర్ల గ్రామంలో అంకమ్మ తల్లి నూతన ఆలయ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ నేత భీమిరెడ్డి వెంకటసూరారెడ్డి (బీవీఎస్ రెడ్డి) ఆదివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ మేరకు బీవీఎస్ రెడ్డిని ఆలయంలో కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వలసపల్లి రాముడు, వలసపల్లి శ్రీను, వేంపాటి రాంబాబు, వి.పుల్లయ్య, వి.సత్యన్నారాయణ, మండల వైఎస్సార్ సీపీ ముఖ్య నేత ముసునూరి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు రావి కొండయ్య, రెడ్డి నాగేశ్వరరావు, రెడ్డి బాబ్జి, తదితరులు ఉన్నారు.

### చికిత్స పొందుతూ మహిళ మృతి

జంగారెడ్డిగూడెం : చికిత్స పొందుతూ మహిళ మృతిచెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. జంగారెడ్డిగూడెంలో నివసిస్తున్న పసుమర్తి శ్రావణి (35) మారుతి షోరూమ్‌లో పనిచేస్తుండేది. ఆమె భర్త చనిపోవడంతో తండ్రి వద్దనే ఉంటోంది. డబ్బులు పొదుపు చేసుకోకుండా ఖర్చు చేస్తోందని ఆమెను తండ్రి మందలించడంతో ఈనెల 4వ తేదీన గడ్డి మందు తాగింది. విషయం తెలుసుకున్న తండ్రి ఆమెను వెంటనే జంగారెడ్డిగూడెం ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా, మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. అక్కడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందింది. ఆమె సోదరుడు బొప్పన రవికుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

# నిశిరాత్రిలో నిశిత పరిశీలన

- ఏలూరు నగరంలో రాత్రి గస్తీపై తనిఖీలు
- క్షేత్రస్థాయిలో పరిశీలనకు ప్రాధాన్యత
- ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి



ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో రాత్రి గస్తీని తనిఖీ చేస్తోన్న జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలో అసాంఘిక శక్తుల భరతం పట్టేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ముఖ్యంగా రాత్రివేళల్లో ఏలూరు నగరంలో పరిస్థితులను తెలుసుకునేందుకు జిల్లా పోలీస్ బాస్ స్వయంగా రంగంలోకి దిగారు. నగరమంతా తిరుగుతూ నైట్‌బీట్‌లను పరిశీలిస్తూ ఆయా ప్రాంతాల్లో పరిస్థితులను తెలుసుకుంటూ శాంతిభద్రతల పరిరక్షణకు చేపట్టాల్సిన ప్రణాళికలపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేశారు. ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి శనివారం అర్ధరాత్రి ఏలూరు నగరంలో రాత్రి గస్తీని ఆకస్మికంగా తనికీ చేశారు. ఏలూరు వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రాత్రి గస్తీ ఏ విధంగా ఉందో స్వయంగా చూశారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఏఏ ప్రాంతాల్లో బీట్ పాయింట్లు పెంచాలి అనే విషయాలను తెలుసుకున్నారు. బీట్ సిబ్బంది నిర్వర్తించాల్సిన విధులపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆయా ప్రాంతాల్లో బీట్ బుక్కులను ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ ఏలూరు నగరంతోపాటు, జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో రాత్రి సమయంలో బీట్ నిర్వహించే సిబ్బంది ప్రతి ఒక్కరినీ నిశితంగా గమనించాలని చెప్పారు. ఉద్యోగ నిర్వహణలో అలసత్వం ప్రదర్శించకుండా నిబద్ధతతో పనిచేయాలని, ప్రజలకు శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. అనుమానిత వ్యక్తుల కదలికలను గమనిస్తూ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఏలూరు నగరంలో ప్రముఖ దేవాలయాలు, ప్రార్థనాలయాలు, బ్యాంకులు, ఏటీఎం సెంటర్ల వద్ద నిఘా బృందాలు సమర్థవంతంగా పని చేయాలన్నారు.

### నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వినతి

ఏలూరు రూరల్ : అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, బీకేఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు ఓ సంయుక్త ప్రకటనలో కోరారు. గత పదిరోజుల నుంచి పడుతున్న వర్షాలకు వరి, మొక్కజొన్న, మిర్చి, మామిడితోటలు దెబ్బతిని రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు ముందస్తు ప్రణాళిక, చర్యలు తీసుకోకపోవడం వల్ల రైతులు మరింత ఎక్కువ నష్టానికి గురయ్యారని ఆరోపించారు. జిల్లా యంత్రాంగం నష్టంపై అంచనా వేయాలన్నారు. ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన రైతులను పంట కొనుగోలు చేసి ఆదుకోవాలని లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

### నేటినుంచి చాటపర్రులో విజ్ఞాన శిబిరం

ఏలూరు రూరల్ : ఈ నెల 8వ తేదీ నుంచి జూన్ 16 వరకూ వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు చాటపర్రు గ్రంథాలయ నిర్వాహకురాలు కె.వాసుకి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కొనసాగే శిబిరంలో నీతి కథలు వినడం, చదవడం, చిత్రలేఖనం, చదరంగం, స్పోకెన్ ఇంగ్లీష్‌తో పాటు సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ చదువుకుంటున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం

- హెచ్చరించిన ఏలూరు నగర ఎస్సైలు రామకృష్ణ, ప్రసాద్
- స్టేషన్లలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



వన్‌టౌన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తోన్న ఎస్సై ఎస్.రామకృష్ణ



టూటౌన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తోన్న ఎస్సై ప్రసాద్

ఏలూరు టౌన్ : నగరంలో ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే సహించేదిలేదని ఏలూరు వన్‌టౌన్ ఎస్సై ఎస్.రామకృష్ణ హెచ్చరించారు. ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీప్రశాంతి ఆదేశాల మేరకు వన్‌టౌన్ సీఐ బోణం ఆదిప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వన్‌టౌన్ ప్రాంతంలోని రౌడీషీటర్లను అందరినీ స్టేషన్‌కు పిలిచి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ మీ కుటుంబాలను, మీ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోని రౌడియిజాన్ని విడనాడాలని రౌడీషీటర్లకు హితబోధ చేశారు. ఆధునిక కాలంలో రౌడీయిజం ద్వారా సాధించేది ఏమీ ఉండదని హితవు పలికారు. ఏదైనా ఉపాధి వెతుక్కుని మంచి మార్గంలో జీవించాలని సూచించారు. ఇష్టారాజ్యంగా నేరాల్లో భాగస్వాములైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రైవేటు సెటిల్మెంట్లు, దందాలకు పాల్పడితే చట్టం మేరకు చర్యలు ఉంటాయనీ, ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. మంచి ప్రవర్తనతో మెలిగితే రౌడీషీట్ తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

**నేరాలకు పాల్పడితే చర్యలు తప్పవు**

ఏలూరు టూటౌన్ సీఐ పి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో టూటౌన్ స్టేషన్ వద్ద రౌడీషీటర్లకు ఎస్సై ప్రసాద్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రస్తుతం ఏం పని చేస్తున్నారు.. జీవనోపాధి కోసం ఏమి చేస్తున్నారనే విషయాలపై ఆరా తీశారు. కుటుంబాలను పోషించుకునేందుకు ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. నేరాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్ల ప్రవర్తనలో మార్పు కనబరిస్తే వారిపై రౌడీషీట్ ఎత్తివేసేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు.

### 10న చిత్రకారులకు జీవిత సాఫల్య పురస్కారాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నగరానికి చెందిన ఏలూరు ఆర్ట్ సొసైటీ 7వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 10వ తేదీన 3వ చిత్రకళా ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ సీనియర్ స్టూడెంట్స్‌కి స్పాట్ పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సభా కార్యక్రమం నాట్యాచార్య గండికోట రాజేష్ శిష్య బృందం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన, అనంతరం సంగీత కచేరి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా మద్రాసుకు చెందిన సినీ పబ్లిసిటీ ఆర్టిస్ట్ కడలి సురేష్, విశ్రాంత చిత్రకళ ఉపాధ్యాయుడు ఉండ్రు ఆశీర్వాదం, అంబికా ఆర్ట్స్ అధినేత మజ్జి సూర్య కాంతారావుకు, కమర్షియల్ ఆర్టిస్టులు మందరపు పోతులూరి ఆచారి, ముక్తాల రామకృష్ణ, సినీ పబ్లిసిటీ బ్యానర్ ఆర్టిస్ట్ బోగాది రాంబాబులకు జీవిత సాఫల్య పురస్కారాలు అందిస్తామన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆళ్ల నాని, నగర మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు తదితరులు హాజరౌతారన్నారు.

# అల్లూరి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళలర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఏలూరు రూరల్ : గిరిజనుల హక్కుల కోసం పోరాటం చేసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజును ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ రవి అన్నారు. ఏలూరు సీపీఎం జిల్లా పార్టీ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో బ్రిటిష్ ప్రభుత్వం ఆగడాలను అడ్డుకుని అట్టడుగు ప్రజల కోసం పోరాటం చేసిన యోధుడు అల్లూరి అని కొనియాడారు. నాడు అల్లూరి గిరిజనలకు భూమి సాధించిపెడితే, నేడు కేంద్ర ప్రభుత్వం అటవీభూములపై గిరిజనుల హక్కులను కాలరాస్తోందన్నారు. అల్లూరి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని బీజేపీకి ప్రజలు గట్టి గుణపాఠం చెప్పాలన్నారు. గిరిజనుల హక్కులు, దేశ సమైఖ్యత కోసం సీపీఎం కృషి చేస్తోందన్నారు. నగర కార్యదర్శి పి కిషోర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గుడిపాటి నరసింహరావు, ఎ.శ్యామలరాణి, పి.ఆదిశేషుతో పాటు నగర కమిటీ సభ్యులు బి.జగన్నాధరావు, కె.రామాంజనేయులు, జె.గోపీ, పి.జానుబాబు, బి.త్రినాథ్, మీసాల సత్యనారాయణ, సింహాచలం తదితరులు పాల్గొని అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

# మహిళా సమస్యలపై పోరాటం



రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న మహిళలు

ఏలూరు రూరల్ : నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల, నియంత్రణపై పోరాటం చేస్తామని విశ్రాంత జడ్జి అడబాల లక్ష్మీ అన్నారు. పెరుగుతున్న ధరలు, మహిళల అవస్థల అంశంపై ఆదివారం ఏలూరు సీపీఐ జిల్లా కార్యాలయంలో మహిళల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం డీజిల్, పెట్రోల్, గ్యాస్ సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతోందని, దీంతో ధరలు పెరిగి మధ్య, పేద తరగతి మహిళలు అవస్థలు పడుతున్నారని దుయ్యబట్టారు. మహిళ సమాఖ్య జిల్లా కన్వీనర్ కొండేటి బేబీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అస్తవ్యస్థ విధానాల వల్ల ప్రజల జీవన విధానం అధోగతి పాలైందన్నారు. ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాల వల్ల కలిగే దుష్పరిణామాలు ఉన్నత వర్గంపై కాకుండా పేదలపై పడిందని ఐద్వా కన్వీనర్ హైమావతి ఆరోపించారు. పాలకుల బుద్ధి, పాలనలో మార్పు రావాలంటే పోరాటాలే శరణ్యమని పలువురు సూచించారు. దీన్ని గుర్తించి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని ప్రకటించారు. సమావేశంలో ఉప్పులూరి లక్ష్మీ, భవాని, గొర్లి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

### 285 మందికి కంటి పరీక్షలు

కామవరపుకోట : స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం చామర్తి కృష్ణారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాసవి క్లబ్, వనిత క్లబ్ పర్యవేక్షణలో రాజమండ్రి పరమహంస యోగానంద నేత్రాలయ వారిచే మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 285 మంది కంటి పరీక్షలు నిర్వహించి 141 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. 15 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు చామర్తి కృష్ణారావు మాట్లాడుతూ కొన్నేళ్లుగా సంస్థ తరఫున అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, రానున్న రోజుల్లో పరిసర ప్రాంత మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. వాసవీక్లబ్ ప్రెసిడెంట్ జయవరపు ప్రసాద్, సెక్రటరీ సమయమంతుల పూర్ణచంద్రరావు, బచ్చు వెంకటేశ్వరరావు, కొండూరు రామకృష్ణ, కొనకళ్ళ అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 14 | అరటి కాయ (1) | 05-07 |
| వంకాయలు (గులాబీ) | 24 | చిక్కుడు కాయలు | 76 |
| వంకాయలు (కాంతులు) | 34 | చామదుంపలు | 50 |
| వంకాయలు (తెలుపు) | 36 | ములక్కాడలు | 05-07 |
| బెండకాయలు | 30 | కంద | 48 |
| పచ్చిమిర్చి | 40 | బీట్‌రూట్ | 36 |
| కాకర కాయలు | 40-44 | కీరా దోస | 26 |
| బీరకాయలు | 30 | ఫ్రెంచ్‌బీన్స్ | -- |
| బీరకాయలు (పందిరి) | 40 | అల్లం | 20 |
| క్యాబేజీ | 18 | కొత్తిమీర (కట్ట) | 20 |
| క్యారెట్ | 34-40 | పాలకూర | 08 |
| దొండకాయలు | 22 | చుక్కకూర | 08 |
| బంగాళదుంపలు | 22 | తోటకూర | 10 |
| ఉల్లిపాయలు | 18 | గోంగూర | 07 |
| గోరుచిక్కుడు | 40 | పుదీనా | 05 |
| దోసకాయలు | 12 | బఠాణి | -- |
| అనపకాయ (1) | 10-15 | క్యాప్సికమ్ | 64 |
| పొట్లకాయ(1) | 15 | చిలకడదుంప | 30 |

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

**ఏసీ బస్సులు..**

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర) | 21.00 | 37 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర) | 21.00 | 25 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి) | 22.00 | 33 |
| ఏలూరు - తిరుపతి(ఇంద్ర) | 19.00 | 21 |

**సూపర్ లగ్జరీ**

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ | 21.45 | 4820 | 11 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 17 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం | 19.45 | 4798 | 16 |
| ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం | 20.15 | 4804 | 21 |
| ఏలూరు -ఈసీఐఎల్ | 22.30 | 4814 | 17 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ | 22.15 | 34820 | 17 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ | 09.00 | 4794 | 31 |
| ఏలూరు - విశాఖపట్నం | 12.00 | 4840 | 34 |
| ఏలూరు -విశాఖపట్నం | 22.00 | 4838 | 29 |
| ఏలూరు - బెంగళూరు | 14.00 | 4021 | -- |
| ఏలూరు -తిరుపతి | 16.00 | 4830 | 28 |

### క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

పోలవరం రూరల్ : తపన ఫౌండేషన్ అధినేత గారపాటి చౌదరి గారి ఆర్థిక సహాయంతో గూటాల గ్రామంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొరగం వెంకటలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు చదువు, క్రీడలు, దేశంపై ఎక్కువ మక్కువ చూపాలన్నారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 30 గ్రామాలనుంచి క్రికెట్ టీమ్‌లు పాల్గొనడం చాలా సంతోషం అన్నారు. తపనా చౌదరి జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమని అన్నారు.

### పేకాట, కోడిపందేల స్థావరాలపై దాడి

పెదవేగి : పేకాట, కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎం లక్ష్మణ్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం న్యాయంపల్లిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేసి నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.15,310 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. అనంతరం పినకడిమిలో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేసి నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 2,100 నగదు, రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

### ఒకే చెట్టుకు రెండు వర్ణాల పుష్పాలు



ఒకే జాతి మందార చెట్టుకు రెండు వర్ణాల మందార పుష్పాలు పూసి చూపరులను ఆకట్టుకుంటున్నాయి. కొయ్యలగూడెం దళితవాడకు చెందిన కార్పెంటర్ ఏలేటి భాస్కరరావు పెరట్లోని మందార మొక్కకు ముద్ద ,రేఖ మందారం జాతికి చెందిన రెండు రంగుల పుష్పాలు ఒకేరోజు పూశాయి. ముద్దమందారం జాతికి చెందిన మందార మొక్కకు విభిన్నంగా రెండు పూలు పూశాయని భాస్కర్ తెలిపారు. – కొయ్యలగూడెం

# రూ. 60 లక్షలతో పూళ్ల చెరువు సుందరీకరణ పనులు



చెరువు సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ శ్రీధర్, ఎమ్మెల్యే వాసుబాబు, ఈశ్వరీ బలరామ్

భీమడోలు: పూళ్లలోని బావివీధి చెర్వును సుందరీకరణ చేసి ప్రజలందరికీ సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. ఈడా పరిధిలోని పూళ్లలో పురాతన చెరువుగా గుర్తింపుపొందిన బావివీధి చెరువును అభివృద్ధిపర్చేందుకు ఏలూరు డెవలప్‌మెంట్ అథారిటీ (ఈడా) మంజూరు చేసిన రూ.50లక్షలు, రివిట్‌మెంట్‌కు మరో రూ.5లక్షలు, గ్రామస్తుల భాగస్వామ్యం రూ.5లక్షలతో పార్కు, ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, ఈడా చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరీ బలరామ్‌తో కలిసి ఆదివారం ఎంపీ శ్రీధర్ శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా చెరువు అభివృద్ధికి సంబంధించిన మ్యాప్‌ను ఎమ్మెల్యే వాసుబాబు పరిశీలించి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీధర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే వాసుబాబు సహాయ సహకారాలతో ఈడా చైర్‌పర్సన్ ఈశ్వరీ బలరామ్ అవసరమైన నిధులు వెచ్చించి చెరువు అభివృద్ధికి చర్యలు తీసుకోవడం సంతోషదాయకమన్నారు. ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ పూళ్ల గ్రామం మధ్యలో బావివీధి చెరువు అభివృద్ధి ద్వారా గ్రామస్తులకు ఇక్కడ ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. వాకింగ్ ట్రాకింగ్, ఫిన్సింగ్, విద్యుద్దీకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈడా చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరీ బలరామ్ మాట్లాడుతూ చెరువును సుందరీకరించి అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే ఈడా లక్ష్యమన్నారు. అనంతరం వారిని డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి శ్రీనివాసరావు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి శ్రీనివాసరావు, సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, ఎంపీటీసీ గొండు కృష్ణ చైతన్య, ఎఎంసీ ఉపాధ్యక్షుడు పులిచర్ల వెంకటకృష్ణారావు, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, నాయకులు కేతినీడి విశ్వేశ్వరరావు, పుప్పాల రామ్మోహనరావు, పుప్పాల బుజ్జులు, యాసా చిట్టియ్య, చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాము మాన్‌సింగ్, ఈడా ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

### ఆర్‌బీకేల ద్వారా పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

కొయ్యలగూడెం : రాజవరం పంచాయతీ గంగవరం రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్, రైతు నాయకులు కంచర్ల సత్యనారాయణ, ఎంపీటీసీ కొండేపాటి చింతయ్య కార్యక్రమానికి హాజరై సిబ్బందితో కలిసి రైతులకు విత్తనాలను సరఫరా చేశారు. రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు ప్రభుత్వం ద్వారా అందించాల్సిన సహాయ సహకారాలు సకాలంలో అందుతున్నాయన్నారు. 50 మందికి సరిపడా విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని సిబ్బంది తెలిపారు. గ్రామ వ్యవసాయ సలహామండలి సభ్యుల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు జనుము, జీలిగి, పిల్లిపెసర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీకే గ్రామ సచివాలయ సెక్రెటరీ కె.అచ్యుత్ కుమార్, ఈడుపుగంటి తాతారావు, వ్యవసాయ సహాయకులు జి.బాలార్జున్, గ్రామ రైతులు, వార్డు సభ్యులు, నాయకులు, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు



భీమడోలు: గుండుగొలనులో దేవదాయ ధర్మశాఖ పరిధిలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక కల్యాణోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిసాయి. ఆలయంలో శనివారం రాత్రి ఉభయదేవేరులతో ద్వాదశ కోవెల ప్రదక్షణలు చేసారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ ఆలయ ఈవో డి.శంకరరావు, ఆలయ మాజీ చైర్మన్ వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పూజారి మంగపతి అచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

**భారీ అన్న సమారాధన**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కురవడంతో ఆలయంలో జరగాల్సిన అన్నసమారాధన కార్యక్రమాన్ని గ్రామంలోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ వగ్వాల భాస్కర్, మాజీ ఉప సర్పంచ్ మామిళ్లపల్లి కాళీబాబు పాల్గొన్నారు.

### 10న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పెదపాడు: ఈనెల 10న పెదపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు పెదపాడు ఎంపీడీవో ఎస్.నిర్మలజ్యోతి తెలిపారు. పెదపాడు మండల పరిషత్ అధ్యక్షురాలు బత్తుల రత్నకుమారి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొంటారని తెలిపారు. పెదపాడు మండలంలోని అందరూ సభ్యులతో పాటు అన్ని శాఖల మండలస్థాయి అధికారులు ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఎంపీడీవో తెలిపారు.